manachourasta

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 01 | సంచిక : 167 | బుధవారం | 27.11.2024



# భారత్ అంటే భిన్నత్వంలో ఏకత్వం

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- కత్తి కంటే పదునైనది ఓటు హక్కు
- ధూం.. ధాంగా కళా ప్రదర్శనలు!

**జనగామ, మన చౌరాస్తా :** భారతదేశమంటే భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తికావొస్తున్న సందర్భంగా మంగళవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో ప్రజాపాలన ప్రజా విజయోత్సవ వేడుకలను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆధ్వర్యంలో ధూం.. ధాంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్, జనగామ ఆర్డీఓ గోపీరామ్, జనగామ ఏసీపీ పార్థసారథి, ఘనపూర్ (స్టేషన్) ఏసీపీ భీమ్ శర్మలతో కలిసి కడియం ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు భారత రాజ్యాంగం ఆవిర్భవించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం మనకు ఎంతో గర్వకారణమన్నారు. ఈ రోజు మన అందరికి ఎంతో ప్రత్యేకమైన రోజన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం 1949, నవంబర్ 26న భారత రాజ్యాంగాన్ని రచించారని, రాజ్యాంగ రచనలో డా. బీఆర్ అంబేద్కర్ ప్రధాన భూమిక పోషించారన్నారు. నిజానికి ఆయనే లేకుంటే దేశాన్ని తలచుకుంటేనే భయమేస్తోందన్నారు. దేశంలో సమసమాజం ఏర్పడాలనే లక్ష్యంతో రాజ్యాంగం మనకు కత్తి కంటే పదునైన ఓటు హక్కును కల్పించిందన్నారు. ఆ ఓటును ప్రజలు అమ్ముకోకూడదని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పేర్కొన్నారు. రాజ్యం పదిలంగా ఉంది అంటే అందుకు కారణం సామాన్య జనం అని అన్నారు. 75 ఏళ్ల గణతంత్రంలో 106 సార్లు రాజ్యాంగ సవరణలు జరిగాయని, రాజ్యాంగ పీఠికను, మూల సూత్రాలను మార్చకూడదని ధర్మాసనం కూడా చెప్పిందన్నారు.



రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు పెద్ద పీఠ వేయాలన్నారు. 50 వేల కొత్త ఉద్యోగాలను ఇచ్చిన మొదటి ప్రభుత్వం తెలంగాణ అని, రైతులకు అండగా నిలవాలనే ఉద్దేశ్యంతో పంట రుణాలను మాఫీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడుతూ, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన సమానత్వం, ఎటువంటిది వివక్ష లేకుండా భావ ప్రకటన స్వేచ్ఛా హక్కు, సౌభ్రాతృత్వ స్వేచ్ఛా హక్కులను అనుసరించాలని, ప్రభుత్వం నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు ఎన్నో రకాల పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1,29,29,323 మంది మహిళలు ఈ ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించున్నారని, దీని ద్వారా మహిళలకు రూ. 61 కోట్ల 57 లక్షల 55 వేల లబ్ధి చేకూరిందని, గృహజ్యోతి పథకం కింద 87,630 జీరో బిల్లులు జారీ చేయడం జరిగిందని, 87,630 కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందని, దీని ద్వారా రూ. 19 కోట్ల 8 లక్షల రాయితీ అందజేసిందని అన్నారు. రైతు రుణ మాఫీ పథకం కింద 57,347 మంది రైతన్నలకు రూ. 487.13 కోట్ల రుణ మాఫీ జరిగిందన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద 3,750 మంది పేదలకు రూ. 5 నుంచి రూ. 10 లక్షల వరకు చికిత్సలు పొందారన్నారు. రూ. 500 కే గ్యాస్ సిలిండర్ పథకం కింద 1,19,58 మందికి లబ్ధి చేకూరిందని, ఇందుకు గాను రూ. 4 కోట్ల 52 లక్షల సబ్సిడీ అందించిందన్నారు. యువ వికాసం పథకం కింద జిల్లాలో 58 నర్సుల ఉద్యోగాలు, 198 డీఎస్సి టీచర్ ఉద్యోగాల నియామక పత్రాలు అందజేయడం జరిగిందని కలెక్టర్ వివరించారు. ఆహ్లాదకర వాతావరణంలో సాగిన కళాయాత్ర ప్రదర్శనలో జిల్లాకి చెందిన తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు చక్రాల రఘు బృందం ఆటపాటలు, నాటికలతో ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పాలనను ఆవిష్కృతం చేశారు. అనంతరం చక్రాల రఘు బృంద సభ్యులను (సాంస్కృతిక కళాకారులు) కలెక్టర్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు, మహిళలు, యువతీయువకులు, పోలీసు అధికారులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



## కొనుగోళ్లలో ఇబ్బందులు ఉండొద్దు

2

- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



## మన హక్కులపై అవగాహన ఉండాలి

2

- సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్



## రైతులను ఆగం చేస్తున్న బీజేపీ సర్కారు

3

- జనగామలో కార్మిక సంఘాల ధర్నా


General News




# కొనుగోళ్లును సమర్ధవంతంగా చేపట్టాలి

## రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**జనగామ, మన చౌరాస్తా :** రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను అధికార యంత్రాంగం సమర్ధవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం న్యూఢిల్లీ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్రం నుంచి రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, కొండ సురేఖ, రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్. చౌహన్ లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖల అధికారులతో వరి ధాన్యం కొనుగోలు పై సమీక్ష నిర్వహించారు.



ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా రాష్ట్రంలో దాదాపు. 8,012 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ అందిస్తున్నట్టు చెప్పారు. ఈ క్రమంలో సన్నరకం, దొడ్డురకం దాన్యం కొనుగోలులో ఎలాంటి అక్రమాలు జరగకుండా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం త్వరలో రేషన్ కార్డుదారులకు, వసతి గృహాలు, గురుకులాలకు సన్న బియ్యం అందించే కార్యక్రమం చేపట్టనున్నందున ఆ దిశగా సన్న రకం ధాన్యం కొనుగోలు త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల సౌకర్యార్థం తాగునీరు, నీడ, ఇతర అన్ని మౌలిక వసతులు కల్పించాలని, గన్ని సంచులు, టార్పాలిన్ కవర్లు కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని తెలిపారు. నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ధాన్యం తూకంలో తరుగు చేయకూడదని, ధాన్యం కొనుగోలు జరిగిన వెంటనే ట్యాబ్ లలో సంబంధిత రైతుల వివరాలు నమోదు చేసి వెంటనే కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలించాలని తెలిపారు. ధాన్యం దిగుమతిలో రైస్ మిల్లర్లు ఆలస్యం చేయకుండా అధికారులు పర్యవేక్షించాలని, రైస్ మిల్లర్లు నిర్లక్ష్యం, అలసత్వం వహించినట్లయితే తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాలలో రైతులు విక్రయించిన ధాన్యానికి సంబంధిత రైతు ఖాతాలలో నగదు 3 రోజులలోగా జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహబూబ్ నగర్ లో ఈ నెల 30న రైతు పండగ విజయోత్సవం లోపు రైతుల ఖాతాలలో 2 లక్షల రూపాయల లోపు రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోలులో ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రులు, ప్రత్యేక అధికారులు, జిల్లాల కలెక్టర్లు ప్రతిరోజు వారి పరిధిలోని కొనుగోలు ప్రక్రియను సమీక్షించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ వీసీలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలి

## కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ, మన చౌరాస్తా : ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యంత విశిష్ట స్థానం కలిగి ఉందని, రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో దళిత బహుజన విలేకరుల ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం 75వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి, రాజ్యాంగం పుస్తకానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశంలో ఉన్న ప్రతి పౌరుడికి ఒకే విధమైన భావ ప్రకటన స్వేచ్ఛ



ఆర్టికల్ 19 (1) Aను పొందుపరిచి సమానత్వం చాటారని కొనియాడారు. దేశంలో సమసమాజ స్థాపన కోసం అంబేద్కర్ నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. కుల వివక్ష, అంటరానితనం నిర్మూలనతో పాటు లింగ సమానత్వం కోసం అనేక చట్టాల్ని రూపొందించినట్లు వెల్లడించారు. ఇంత గొప్ప విశిష్టత కలిగిన రాజ్యాంగాన్ని ప్రతి పౌరుడు గౌరవించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో మన్సూరి, డీపీఆర్ఓ పల్లవి, అదనపు పౌర సంబంధాల అధికారి శ్రీనివాసరావు, సీనియర్ జర్నలిస్టులు ఎండబట్ల భాస్కర్, కాసాని ఉపేందర్, కన్నారపు శివశంకర్, తిప్పారపు ఉపేందర్, మాచర్ల ఆశీశ్, బొమ్మగాని శ్రీకాంత్ గౌడ్, సుధాకర్, మణి, జలగం రాము, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మ భిక్షం, జిశ్వంత్ పాల్గొన్నారు.



# హక్కులపై అవగాహన ఉండాలి

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్ ఆధ్వర్యంలో గవర్నమెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమం హైస్కూల్ లో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలు గురించి పిల్లలకు వివరించారు. మంచి ప్రవర్తనతో ఉండాలని, గవర్నమెంట్ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం రవీంద్ర, అసిస్టెంట్ కౌన్సిల్ జోష్నా, అసిస్టెంట్ లీగల్ కౌన్సిల్ ఆర్ శ్రీహరి, గవర్నమెంట్ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ హెచ్ఎం జే లచ్చీరాం, స్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే గేట్ బడిలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్ నగరంలోని పెరికవాడలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల రైల్వే గేట్ లో రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు. అంతముందు ఆ పాఠశాల సోషల్ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడు, బీసీటుయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి ఆధ్వర్యంలో వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనీ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# సీసీరోడ్డు పనులను ప్రారంభం

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** సీసీ రోడ్డు పనులను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. మంగళవారం మండలంలోని బోనకొల్లూరులో రూ.5 లక్షల నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు.ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులను మంజూరు చేయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

Local News




# రైతులను ఆగం చేస్తున్న బీజేపీ

**జనగామ, మన చౌరాస్తా :** సంయుక్త కిసాన్ మోర్చా కేంద్ర కార్మిక సంఘాల జాతీయ కమిటీల పిలుపులో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రైతు కార్మిక వ్యవసాయ కూలీల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటానికి సంసిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి యాటల సోమన్న పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించి అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రైతు సంఘం, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు, రాపర్తి సోమయ్య, గంగాపురం మహేందర్ అధ్యక్షత వహించగా తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు విజేందర్ ,తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సింగరపు రమేష్ పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో వచ్చిన నాటి నుండి రైతు వ్యతిరేక కార్మిక వ్యతిరేక వ్యవసాయ కూలీ వ్యతిరేక ప్రజావ్యతిరేక విధానాలను తీసుకువస్తూ ప్రభుత్వ రంగ సంస్థలన్నీటిని కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అమ్మి వేస్తుందన్నారు. అంబానీ, అదాని వంటి బడా కార్పొరేట్ శక్తులకు రెడ్ కార్పెట్ వేస్తూ రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చిందన్నారు. రైతుల చేతుల్లో ఉన్న భూములను కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్రని చేస్తే 13 నెలల పాటు ఢిల్లీ నడిబొడ్డున మోడీ ప్రభుత్వాన్ని అష్టదిగ్బంధనం చేసి ప్రతి వ్యతిరేక చట్టాలను గత్యంతరం లేక మోడీ ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా దేశ రైతాంగానికి క్షమాపణ చెప్పి నల్ల చట్టాలను రద్దు చేసుకునే అంతవరకు పోరాటం చేశామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా వానకాలం, యాసంగి నిధులను రైతుల ఖాతాలో తక్షణమే జమ చేయాలని, కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని, సమగ్ర పంటల బీమా పథకాన్ని రూపొందించాలని, రైతులు పండించిన అన్ని రకాల పంటలకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాకు మద్దతు తెలిపి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ పట్టాలి ఇప్పించి ఇండ్ల నిర్మాణం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో వచ్చిన నాటి నుండి రైతు వ్యతిరేక కార్మిక వ్యతిరేక ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఆరోపించారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ నికరంగా పోరాడుతున్న సంఘాలు ఎర్రజెండా సంఘాలు మాత్రమే అన్నారు. వారి పోరాటానికి సంపూర్ణ మద్దతునిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయడం కోసం కట్టుబడి నిబద్ధలతో రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఆదిసాయన్న, జిల్లా కార్యదర్శి చొప్పరి సోమయ్య, ఏఐకెఎఫ్ జిల్లా కార్యదర్శి రవీందర్ గౌడ్, మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య, యాదలక్ష్మి, భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జోగు ప్రకాష్, తాండ్ర ఆనందం, ప్రజాసంఘాల రమావత్ మీట్యా నాయక్, అన్నబోయిన రాజు, పయోవుల బిక్షపతి, పుత్తనూరి ఉపేందర్, యాకన్న, రైతులు కార్మికులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గోపా మండల నూతన కమిటీ ఎన్నిక



**పాలకుర్తి, మన చౌరాస్తా :** జిల్లాలోని గౌడ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్(గోపా )సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు జనగామ జిల్లా గౌడ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్(గోపా) జిల్లా అధ్యక్షుడు మేకపోతుల ఆంజనేయులు గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గోపా మండల అధ్యక్షుడు కమ్మగాని రమేష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మండల నూతన కమిటీని ప్రకటించారు. గోపా అధ్యక్షుడిగా కమ్మగాని రమేష్ గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా వడ్లకొండ లక్ష్మీనారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బండి యాకన్న గౌడ్, సహాయ కార్యదర్శిగా మూల రాగవులుగౌడ్, కోశాధికారిగా ముంజ రాములు గౌడ్, ఉపాధ్యక్షుడి మెరుగు మధుసూదన్ గౌడ్, గౌరవ సలహాదారుగా మూల వెంకటేశ్వర్లు గౌడ్, బండి సోమన్న గౌడ్, గూడ దామోదర్ గౌడ్, కారు పోతుల శ్రీనివాస్ గౌడ్, తాళ్ల పెల్లి ఉప్పలయ్య గౌడ్, గిరగాని సమ్మయ్య గౌడు భీమయ్య గౌడ్‌లను సభ్యులుగా ఎన్నుకున్నారు.




## ‘ప్రజా పాలన’ పాట ఆవిష్కరణ

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలపై కొమురవెల్లి మండలం అయినాపూర్ గ్రామానికి చెందిన సాంస్కృతిక సారథి కవి గాయకులు, పిన్నింటి రత్నం రచన గానంలో రూపొందించిన ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల పాటను జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ పాషా, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, డీపీఆర్వో పల్లవి ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షులు చక్రాల రఘు, సారథి కళాకారులు, టీమ్ ఇంచార్జి బానోత్ గణేష్, జనగామ శంకర్, కేమిడి కనుకరాజు, పినుమల్ల సాంబయ్య, తిప్పర్తి శ్రీనివాసులు, గడిపే బాలన్న, ముక్కెర సంపత్ కుమార్, బావండ్లపల్లి చిరంజీవి, బొమ్మెర రవి, బీజ్జురి చందు, ఏడవల్లి విజయ, పద్మ, స్వప్న, రంజాన్ బీ, మమత, చామంతి తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాల అభివృద్ధే లక్ష్యం

### ఎమ్మెల్యే మామిడాల యశస్వి రెడ్డి

**పాలకుర్తి, మన చౌరాస్తా :** పాలకుర్తి మండలం వల్మిడి గ్రామంలో అంగన్వాడి సెంటర్‌కు, బమ్మెర గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మామిడాల యశస్వి రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్టు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షుడు సత్యనారాయణ మండల అధ్యక్షుడు కుమారస్వామి, డీఈ రామలింగాచారి, డీపీఆర్ఓ వసంత, ఏపీవో మంజుల తదితరులు పాల్గొన్నారు.




## అనుమతిలేని వాటర్ ప్లాంట్లను వెంటనే సీజ్ చేయాలి

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలో ఐఎస్ఐ అనుమతి లేని వాటర్ ప్లాంట్ ను సీజ్ చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం శాఖ కార్యదర్శిల సమావేశానికి పట్టణ కమిటీ సభ్యులు కల్యాణం లింగం అధ్యక్షత వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టణంలో ఐఎస్ఐ మార్కులేని వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నాయన్నారు. మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్, పాలకవర్గం వాటిని అదుపు చేయడంలో నిర్లక్ష్యంగా ఉండడం సరికాదన్నారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు పగిడిపల్లి బాలమణి, బండ సౌందర్య, శాఖ కార్యదర్శిలు దామెర అబ్రహం లింకన్, కొమ్మలోని రాజు, మాదాసి సుధాకర్, బాలస్వామి, తిప్పారపు తులసి, కొడిదాల అంజమ్మ, రజియా, నమలిపురి రమ, పరిష, లక్ష్మి పాల్గొన్నారు.

## ‘మాలల సింహగర్జన’ను సక్సెస్ చేయాలి

**జనగామ టౌన్, మన చౌరాస్తా :** డిసెంబర్ 1న సికింద్రాబాద్లోని పరేడ్ గ్రౌండ్లో జరుగనున్న మాలల సింహగర్జనను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తాలో సింహగర్జన వాల్పోస్టర్ను ఆవిష్కరించారు. అనంతరం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాల కుల సంఘం నాయకులు గద్దల ఉప్పలస్వామి, చింతల ఉపేందర్, గునిగంటి నరేశ్, గునిగంటి చంద్రశేఖర్, గద్ద సాయికుమార్, తుంగ సతీశ్, అనమాల మహేందర్, మద్దెల కార్తీక్, హరీశ్, నిరంజన్, గునిగంటి నర్సింగరావు, గునిగంటి శివకుమార్, దారం రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటీటీలోకి కంగువ



మన చౌరాస్తా, సినిమా : స్టార్ హీరో సూర్య నటిస్తున్న లేటెస్ట్ మూవీ కంగువ. సూర్య ఎన్నో డిఫరెంట్ మూవీస్ చేశాడు. ఎన్నో ప్రయోగాత్మక సినిమాలు చేశాడు సూర్య. అలాగే ఇప్పుడు కంగువ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఈ సినిమాలో సూర్య రెండు డిఫరెంట్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించి మెప్పించాడు. కంగువ సినిమా ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా రూ.100 కోట్లు దాటేసింది. దాదాపు 350 కోట్లకు పైగా ఖర్చుతో తెరకెక్కిన ఈ సినిమా 100 కోట్ల వసూళ్లను రాబట్టింది. ఈ సినిమా సౌండింగ్ విషయంలో చాలా విమర్శలు వచ్చాయి. సౌండ్ ఎక్కువగా ఉండటంతో సినిమా గందరగోళంగా ఉంది అని చాలా మంది విమర్శించారు. దీంతో ఇప్పుడు సౌండ్ లెవెల్‌ను 2 పాయింట్లు తగ్గించి సినిమాను నడపాలని నిర్మాత జ్ఞానవేల్ థియేటర్ యజమానులను కోరారు. సూర్య హీరోగా సిరుత్తై శివ దర్శకత్వంలో తెరకెక్కిన కంగువ ఈనెల 14న థియేటర్లలో విడుదలైంది. ఇక ఇప్పుడు ఈ సినిమా ఓటీటీ విడుదలకు సంబంధించిన టాక్ కోలీవుడ్ లో వైరల్ అవుతోంది. ఈ భారీ బడ్జెట్ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. దిశా పఠానీ, బాబీ డియోల్, కోవై సరళ, యోగి బాబు, రెడ్డిన్ కింగ్స్లీ, నటరాజన్ సుబ్రమణియన్, జగపతి బాబు, కెఎస్ రవికుమార్ ఈ సినిమాలో కీలక పాత్రల్లో కనిపించారు. యూవీ క్రియేషన్స్, స్టూడియో గ్రీన్ సంస్థలు సంయుక్తంగా భారీ వ్యయంతో సూర్య నటించిన కంగువ చిత్రాన్ని నిర్మించాయి. ఈ చిత్రాన్ని 10కి పైగా భాషల్లో 3డి టెక్నాలజీలో చిత్రీకరించారు.ఈ సినిమా విడుదలైనప్పటి నుంచి ఎన్నో విమర్శలను ఎదుర్కొంటోంది. మ్యూజిక్ విషయంలో సినిమా నిరాశపరిచిందని అభిమానులు విమర్శించారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా ఓటీటీ విడుదలకు సంబంధించిన సమాచారం ఇప్పుడు బయటకు వచ్చి వైరల్ అవుతోంది. పలు నివేదికల ప్రకారం అమెజాన్ ప్రైమ్ ఈ చిత్రాన్ని 100 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసిందని అంటున్నారు. అలాగే డిసెంబర్ 13న ఈ చిత్రాన్ని అమెజాన్ ప్రైమ్ ఓటీటీలో విడుదల చేయనున్నట్టు సమాచారం. త్వరలోనే దీని పై క్లారిటీ రానుంది.

# Varsha

## Digitals

మీ పుట్టిన రోజు, పెళ్లిరోజుల శుభాకాంక్షలు.. నూతన సంవత్సర గ్రీటింగ్ కార్డ్స్ మరియు క్యాలెండర్లను ఆకర్శనీయంగా డిజైనింగ్ చేయబడును.. వివరాలకు ఈ కింది నంబర్లను సంప్రదించండి.

**8555 800 812**

**9676 400 812**

